





పార్టీలో చేరికలపై నేతల దృష్టి

- బీఆర్ఎస్ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు
- ద్వితీయ శ్రేణి నేతలపై పార్టీ పెద్దల ఫోకస్
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పార్టీలో మొదటి నుంచి ఉన్న నేతలు, కార్యకర్తలు
- పార్టీ కోసం కష్టపడిన తమకు ఎలాంటి ఫలితం దక్కడం లేదని వాపోతున్న వైనం



మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌కు పార్టీ కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రధాన పార్టీలు చేరికలపై దృష్టి పెట్టాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు రెండు కూడా ఇతర పార్టీల నుంచి నాయకులను తమ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వలసలు ఎక్కువగా ఉన్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్, బీజేపీలు ప్రధానంగా దృష్టి పెట్టి చేరికలను ప్రోత్సహిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలోకి వలసలు భారీగా జరుగుతున్నాయి. తొమ్మిదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా వలసలకు కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ మండల అధ్యక్షులు, మండల పరిషత్ అధ్యక్షులు, డీసీసీబీ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్నారు. బీజేపీ సైతం చేరికలపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను పార్టీలోకి చేర్చుకునేందుకు దృష్టి పెట్టింది.

చేరికల వల్ల ఎవరికి లాభం!?

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి, బీజేపీలోకి వలసలు జోరుగానే సాగుతుంటే నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీచేస్తున్న అభ్యర్థులు చేరికల వల్ల లాభం ఎంత నష్టం ఎంత అనే అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. తొమ్మిదేళ్ల పాటు అధికార బీఆర్ఎస్‌లో ఉండి అన్ని విధాలుగా లాభం పొందిన నేతలంతా కాంగ్రెస్‌లో చేరుతుండటంతో కాంగ్రెస్‌లోని ద్వితీయశ్రేణి నాయకులు కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా అధికారాన్ని అనుభవించిన నేతలు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి పార్టీలోకి చేరడంపై నేతలంతా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వాళ్లదే హవా కొనసాగుతుందని ఇన్ని రోజులు పార్టీ కోసం కష్టపడిన తమకు ఎలాంటి ఫలితం దక్కడం లేదని నేతలంతా వాపోతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోసం చేరికలు

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని చెప్పడంతో స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్న నేతలంతా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్, కార్పొరేటర్ల టికెట్లు ఆశిస్తున్న వారంతా పార్టీలో చేరుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల నుంచి పోటీ చేసేందుకు నేతలంతా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ ప్రత్యర్థుల చేరికలపై దృష్టి పెట్టి వారు ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయించుకుంటున్నారు.

బీఆర్ఎస్ నుంచి భారీగా కాంగ్రెస్‌లోకి

గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మొదట్లో ఇతర పార్టీల నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు ఆసక్తిని చూపలేదు. కానీ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రాగానే చేరికలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నేతలందరినీ పార్టీలో చేర్చుకుంది. ఆర్మూర్ మున్సిపల్ స్థానాన్ని, డీసీసీబీ చైర్మన్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఆర్మూర్, నిజామాబాద్‌కు చెందిన మెజార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖతను వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆర్మూర్‌కు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతలు, ఆర్మూర్ మండల పరిషత్ అధ్యక్షుడు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరేందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మరికొంత మంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం

బీజేపీలోకి వలసలు

పార్టీలో చేరికల విషయంలో బీజేపీ ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటుంది. కాంగ్రెస్‌లో, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న నేతలపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇటీవల బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు కొంతమంది ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. నగరానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ తరహాలోనే బీజేపీ సైతం బీఆర్ఎస్ నేతలను టార్గెట్‌గా చేసుకొని వలసలకు ప్రాధాన్యం ఇస్తుంది. వివాదాస్పదంగా ఉన్న నేతలను పార్టీలోకి చేర్చుకునే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. పార్టీలో ఉన్న కార్యకర్తలు, నాయకులు ఎవరూ కూడా అసంతృప్తి చెందకుండా ఇతర పార్టీ నేతలను పార్టీలో చేర్చుకుంటుంది.



నగరంలోని సుభాష్‌నగర్ రామాలయం వద్ద ఏర్పాట్లు

శ్రీరామనవమికి సర్వం సిద్ధం

- జిల్లా వ్యాప్తంగా వేడుకలకు ముస్తాబైన రామాలయాలు



నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16: సీతారాముల కల్యాణానికి జిల్లాలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. సీతారామ చంద్రస్వామి కల్యాణ కార్యక్రమానికి జిల్లాలోని ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రామాలయం, సుభాష్‌నగర్ రామాలయం, పెద్ద రాంమందిర్‌లలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం 12.05 గంటలకు సీతారాముల కల్యాణం జరగనుంది. ఉదయం నుంచి అభిషేకాలు, డోలారోహనం తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సుభాష్‌నగర్ రామాలయంలోని సీతారాముల కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి తాపం నుంచి కాపాడేందుకు ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆలయాల్లో భక్తుల కోసం మంచినీరు, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలకు కొత్త రంగులు వేశారు. విద్యుత్ వెలుగుల్లో ఆలయాలన్నీ వెలిగిపోతున్నాయి. నగర శివారులోని మాదవనగర్ సాయిబాబా ఆలయంలో సాయిబాబా పుట్టిన రోజు వేడుకల కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మాధవనగర్ కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.



రామాలయంలో మహిళల వేడుకలు



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న దేవేందర్‌సింగ్ చౌహాన్

రాష్ట్ర పౌరసరఫరాల ముఖ్యకార్యదర్శి


జిల్లాలో ముమ్మర తనిఖీలు

- రైస్‌మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన
- రైతులకు ఫోన్ చేసి వివరాలు అడిగిన దేవేంద్రసింగ్ చౌహాన్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి దేవేంద్రసింగ్ చౌహాన్ జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ధాన్యం కొనుగోళ్లపై సమీక్షకు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పలు రైస్‌మిల్లులను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. పలువురు రైతులకు సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయా, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. గుండారంలోని జైగణేష్ రైస్ మిల్‌ను సందర్శించి ధాన్యం మర పడుతున్న తీరును, స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం, చంద్రయాన్‌పల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. 17 శాతానికి లోబడి తేమ శాతం ఉండేలా చూసుకోవాలని ఈ మేరకు ఎఫ్ఏక్యూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తెచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో అధికారులతో, రైస్‌మిల్లులతో సమీక్షించారు. రాష్ట్రంలో 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని అన్నారు. బిల్లుల చెల్లింపులు, సీఎంఆర్ కేటాయింపులు తదితర అంశాలపై వివరించారు. 2018-19 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్టు చార్జీల విషయంపై భారత ఆహార సంస్థతో సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ అధికారులను ఒప్పించి 900 కోట్లను మంజూరు చేశామన్నారు. సీఎంఆర్ కేటాయింపులు లక్ష్యానికి అనుగుణంగా జరిగేలా ధాన్యం మిల్లింగ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ముఖ్య కార్యదర్శి దృష్టికి తెచ్చారు. ఇప్పటికే జిల్లాలో 373 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని లక్షా 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని 98 కోట్ల బిల్లులను రైతులకు చెల్లించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. 90లక్షల వరకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై డీఎం జగదీశ్, సంబంధిత శాఖ అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న దేవేంద్రసింగ్ చౌహాన్



వడ్డీ వ్యాపారుల్లో దడ

- పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ రూ.లక్షల నగదు, ప్రామిసరీ నోట్లు, ల్యాండ్ డాక్యుమెంట్లు
- గుట్టు చప్పుడు కాకుండా పోలీసులను కలుస్తున్న వ్యాపారులు
- అసలు సూత్రధారులపై నమోదు కాని కేసులు



పోలీసుల తనిఖీలు



భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 16: జిల్లాలోని వడ్డీ వ్యాపారుల్లో దడ మొదలైంది. మనీ ల్యాండరింగ్ చట్టాన్ని ఉల్లం గిస్తూ అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ బాధితుల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై పోలీసులు నజర్ పెట్టారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌గల్ పట్టణంలో ఇటీవల ఓ వడ్డీ వ్యాపారి ఓ బాధితుడికి చెందిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకొని సుమారు రూ.పదిలక్ష ల వరకు అప్పు ఇచ్చాడు. ఎనిమిది నెలల కాలంలో ఆ వ్యా పారి ఏకంగా బాధితుడి నుంచి నెలకు రూ.40 వేల చొప్పున వడ్డీ వసూలు చేయడంతో బాధితుడు ఏకంగా ఇంటినే అమ్మివేశాడు. ప్రస్తుతం ఆ కుటుంబం కిరాయి ఇం ట్లో అద్దెకు ఉంటుంది. ఇలా అనేక మంది బా ధితులు అధిక వడ్డీలు కట్టలేక ఉన్న ఆస్తులను పోగొట్టుకొని రోడ్డున పడ్డారు. అనేకమంది బాధితులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం అక్రమం వడ్డీ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝులిపించారు. భీమ్‌గల్ పట్టణం లో పోలీసులు జరిపిన తనిఖీల్లో నలుగురు వడ్డీ వ్యాపారు లపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి పెద్ద మొ త్తంలో నగదు, ప్రామిసరీ నోట్లు, ల్యాండ్ డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన కొం దరు వ్యాపారులు ముందుగానే సంబంధిత పత్రాలను మరోచోటుకు తరలించారు. మరికొందరు మండలంలోని పలుకుబడి కలిగిన నాయకులతో పోలీసు స్టేషన్‌కు కెళ్లి మంతనాలు జరిపినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారి జాబితా ఉన్నా.. పోలీసులు చిన్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటున్నారని పలువురు వాపోతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మారనున్న రాజకీయాలు

- వంద రోజుల్లో అమలు కాని హామీలు ఆగస్టు తర్వాత ఎలా అమలవుతాయి !? : ఎంపీ అర్వింద్ ధర్మపురి

పెద్దబజార్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల అనం తరం తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారుతాయని.. రాష్ట్రంలో అధికార పార్టీలో రాజకీయాలు మొదలయ్యాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. వంద రోజుల్లో అమలు కాని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు.. ఆగస్టు తర్వాత అమలు ఎలా సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డిని అర్వింద్ ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత ఆగస్టు నుంచి రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. దేశవ్యాప్తంగా మోదీ ప్రభంజనం కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో కూడా ఆ ప్రభావం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి 12 సీట్లు వస్తాయని కాంగ్రెస్ నేతలే చెబుతున్నారని అన్నారు. బీజేపీ పది సంవత్సరాల పాలనలో ప్రజల ఆకాంక్షలను నెరవేరాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సీఎం రేవంత్‌రెడ్డికి కత్తిమీద సాములాగా మారుతాయన్నారు. కాంగ్రెస్ పార్ట హిందూ వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో బ్రిటీష్ వాళ్ల కంటే ఎక్కువ సంస్కృతిని ధ్వంసం చేసిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేస్తే హిందువులకు పౌరసత్వం ఇవ్వర న్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌కు పట్టిన గతి కాంగ్రెస్‌కు పడుతుందని అర్వింద్ ధ్వజమెత్తారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే బాధ్యత తమదేనన్నారు. బీజేపీ మూడోదఫా అధికారంలోకి రాగానే ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. ఆప్ పార్టీ కాదని పాప్ పార్టీ అని ఎద్దేవా చేశారు. కవితను జైళ్లో వేయలేదని టీవీ ఛానళ్లలో కొందరు నేతలు లొల్లి చేశారని.. ప్రస్తుతం రెండు కేసుల్లో జైల్లో వేశారన్నారు. దేశంలో యూనిఫాం సివిల్ కోర్టు ద్వారా మహిళలకు రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. దేశంలో పేపర్ లీక్‌లపై ప్రత్యేక చట్టం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి,అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బిలోలి కోర్టు ఆవరణలో ప్రజాప్రతినిధులు



'బాబ్లీ' కేసులో.. బిలోలి కోర్టుకు ప్రజాప్రతినిధులు

బోధన్ రూరల్, ఏప్రిల్ 16 : బాబ్లీ కేసులో భాగంగా మహారాష్ట్రలోని ధర్మాబాద్ పరిధిలో గల బిలోలి కోర్టుకు మంగళవారం పలువురు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 సంవత్సరంలో గోదావరి నీటి కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో పోరాటం చేసిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు ఆనాటి శాసనసభ్యులపై మహారాష్ట్ర ప్రభుత్వం పలు సెక్షన్ల కింద కేసులు పెట్టడం జరిగింది. గత 14 ఏళ్లుగా మహారాష్ట్రలోని ధర్మాబాద్ కోర్టులో కొనసాగిన ఈ కేసు.. ప్రస్తుతం బిలోలి కోర్టుకు బదిలీ అయినట్టు తెలుగుదేశం పార్టీ లీగల్ టీమ్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు తెలిపారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు దేవినేని ఉమా మహేశ్వర్, నక్క ఆనంద్‌బాబుతో అప్పటి శాసనసభ్యులు గంగుల కమలాకర్, హన్మంత్ షిండే, రత్నం తదితరులు మంగళవారం బిలోలి కోర్టుకు హాజరయ్యారని తెలిపారు. ఆ తర్వాత మాజీ మంత్రులు, న్యాయవాదులు బోధన్ పట్టణంలోని కమ్మ సంఘానికి చేరుకుని భోజనాలు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

ఖిల్లా, ఏప్రిల్ 16: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు 6వ టౌన్ ఎస్సై రమేష్ తెలిపారు. సారంగపూర్ గ్రామానికి చెందిన రాజేశ్వరి (25) బీడీలు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లతో జీవనం సాగించేది. అయితే, పోషణ భారంగా మారడం, పైగా ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో తీవ్ర మనస్థాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 16: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందల్వాయికి చెందిన షైనశ్రీకాంత్ (37) అనే వ్యక్తి గ్రామంలోని పెద్దచెరువు కిందగల అలుగు వద్ద చేపల వేటకు వెళ్లి రెండు కాళ్లకు వల చుట్టుకోవడంతో మృతి చెందినట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. శ్రీకాంత్‌కు మతిస్థిమితం సరిగా లేదని, అతను చేపల కోసం వెళ్లి కాళ్లకు వల చుట్టుకోవడం వల్ల మృతి చెందాడని అన్నారు. మృతుని సోదరుడు షైన శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మోదీ అంటేనే అభివృద్ధి : ఎంపీ అర్వింద్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 16: అవినీతికి దూరంగా, అభివృద్ధే ధ్యేయంగా ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఘన విజయాలను సాధిస్తోందని, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీజేపీని గెలిపించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ముచ్కూర్ చౌరస్తా వద్ద ఉన్న శ్రీ బ్రహ్మ లింగేశ్వర టీ పాయింట్ వద్ద చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటుతో రైతుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. మున్ముందు నియోజకవర్గంలో భవిష్యత్ కార్యక్రమాలు ఉండనున్నాయని, బీడీ కార్మికుల కోసం 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. ధర్మం నిలవాలన్న, దేశం గెలవాలన్న బీజేపీయే రావాలని, మోదీయే ప్రధాని కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.


డీసీఎం ఢీకొనడంతో మృతి చెందిన ప్రభాకర్ (ఇన్‌సెట్ మృతుడు ఫైల్)

నిశ్చితార్థం జరిగిన తెల్లారే యువకుడి మృతి

● రోడ్డు దాటుతుండగా బైక్‌ను ఢీకొన్న వ్యాన్


నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 16: చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు చూశాడు.. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించాడు.. ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలనుకున్నాడు.. నిశ్చితార్థం సైతం చేసుకున్నాడు.. అయితే, ఆ ఆనంద క్షణాలు కొన్ని గంటలు కూడా మిగలలేదు. తెల్లారే మృత్యువు ఆ యువకుడి ఆశలు ఛిద్రం చేస్తూ విగతజీవిగా మార్చింది. ఈ హృదయ విదారక ఘటన రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తిర్మన్‌పల్లికి చెందిన దిలారి ప్రభాకర్(28) బీఫార్మసీ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. జీవితంలో స్థిరపడ్డాడు. కాగా, వివాహం చేసుకుందామని పెద్దలు చూసిన అమ్మాయిని చూశాడు. ఇందల్‌వాయి మండలం తిర్మన్‌పల్లికి చెందిన యువతిని వివాహం చేసుకునేందుకు అంగీకరించి ఈనెల 15న సోమవారం నిశ్చితార్థం సైతం చేసుకున్నాడు. ఆ ఆనందంలో మిత్రులు రాజు, రవిలతో కసిసి బైక్‌పై సరదాగా బయటకు వెళ్లాడు. తిరిగి గ్రామంలోకి వస్తుండగా గ్రామశివారులో కల్లుబట్టి వద్ద అదేసమయంలో మలుపు వద్ద పొల్ల నుంచి శ్రీనగర్‌కు వడ్ల లోడ్‌తో వేగంగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. దాంతో బైక్ కొద్దిదూరం లాక్కెళ్లింది. ప్రభాకర్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మిగతా ఇద్దరు మిత్రులు మాత్రం స్వల్పగాయాలతో తప్పించుకున్నారు. డీసీఎం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిశ్చితార్థం జరిగి వివాహం జరుగుతుందనుకున్న తరుణంలో కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు హృదయవిదారంగా రోధించారు. తిర్మన్‌పల్లి గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.

ముగిసిన బడాపహాడ్ టెండర్

● ఎన్నికల కోడ్‌తో నిర్వహణ బాధ్యతలపై ఉత్కంఠ

వర్ని,ఏప్రిల్16: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన బడా పహాడ్(పెద్దగుట్ట)పుణ్యక్షేత్రం టెండర్ ఈ నెల 14తో ముగిసింది. 2021- 22ఏడాదికి గాను రూ.3.20కోట్లకు టెండర్ కాగా 2023-24ఏడాదికి రూ.3.50కోట్లకు టెండర్‌ను కొందరు సిండికేట్‌గా ఏర్పడి దక్కించుకున్నారు. దీంతో మళ్లీ టెండర్‌ను దక్కించుకునేందుకు గతంలో టెండర్ పొందిన వ్యక్తులు మళ్లీ రూ.4కోట్లకు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వాసనీయంగా తెలిసింది. టెండర్ ద్వారా యేట భక్తులు నిలువుదోపిడికి గురి కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కొత్త వేసేందుకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు కొత్త టెండర్ వేయడంలో కోడ్‌ను పరిగణలోకి తీసుకుని నిర్వహణ బాధ్యతలను జిల్లా వక్ఫ్‌బోర్డు సిబ్బందికి అప్పజెప్పే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర సీఈవో ఖాజా మొయినోద్దీన్‌లు బడాపహాడ్ నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్‌ల నుంచి స్వాధీనపర్చుకునేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. టెండర్ కాల వ్యవధి ముగిసినందున సంబంధిత అధికారులు ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు భక్తులకు మౌలిక సదుపాయల కల్పన, నిర్వహణ బాధ్యతలను స్థానిక వక్ఫ్‌బోర్డు సిబ్బందికి అప్పజెప్పి కాంట్రాక్టర్‌ల నిలువు దోపిడిని నియంత్రించి పారదర్శకంగా దర్శన భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం



ముస్తాబైన ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం



శక్కర్‌నగర్ రామాలయ ముఖ ద్వారం



డొంకేశ్వర్ రామాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

డిచ్‌పల్లి: నేడు చారిత్రాత్మక రామాలయంలో రామనవమి పురష్కరించుకొని ఆలయ నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆల య ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా దంపతులు నేడు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన అనంతరం సీతరామ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ , ధర్మకర్తలు భక్తులకు త్రాగు నీరు, అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నారు.

● మాధవనగర్ సాయిబాబా ఆలయంలో బాబా జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

క్రోధి నామ సంవత్సరం పురష్కరించుకొని నేడు బర్దిపూర్ శివారులో గల సాయిబాబా మందిరంలో బాబా జన్మదిన వేడుకలను వైభోపేతంగా నిర్వ హిస్తున్నమని ఆలయ సహాయ కమిషనర్ సుప్రియ, ఈవో రవీందర్ లు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 5గంటలకు బాబా కగడ హారతి, మహా గణపతి పూజ,బాబా అభిషేకం, 7గంటలకు ప్రత్యేక హరతి, బాబా నామస్మరణం,జన్మదినవేడుకలు, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణం, అనంతరం సాయిబాబా పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని, భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయలగలరని ఆయన కోరారు.

మోపాల్: శ్రీరామనవమి సందర్భంగా మాధవనగర్ సాయిబాబా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదేరోజు సాయిబాబా జన్మదినం కావడంతో ఏవో రవీందర్‌గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రతీసంవత్సరం సాయిబాబా ఆలయంలో ఉదయం సాయిబాబా జన్మదిన వేడుకలు, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణోత్సవం భక్తుల సమక్షంలో పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బోధన్‌రూరల్: బోధన్ శక్కర్‌నగర్‌లోని రామాలయం భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందినది. ఈ రామాలయానికి ఎంతో విశిష్టత ఉండటంతో ప్రతియేటా శ్రీరామ నవమి రోజు వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు. ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉండటంతో ఈ ఆలయం శ్రీరామ నవమి వేడుకలకు ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుంది. శక్కర్‌నగర్ రామాలయంలో శ్రీ సీతారాముల సతీసమేతంతో పాటు హనుమంతుని వెలిసిన విగ్రహాలు దర్శనమిస్తాయి. 1951లో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఆలయంలోని సీతారాముల, లక్ష్మణ, అంజనేయ స్వామి విగ్రహాలు పాలరాతితో నిర్మించబడి ఉంటాయి. ఆలయంలోని శ్రీరామ చంద్రుల విగ్రహాలు పశ్చిమాభిముఖం ఉండటంతో రెండవ భద్రాద్రిగా శక్కర్‌నగర్ రామాలయాన్ని పిలుచుకుంటారు. ఆలయానికి సుమారు పదహారు లక్షలతో రాజగోపురం నిర్మాణం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం గదులను నిర్మించారు. ప్రతియేటా శ్రీరామ నవమి రోజు ప్రత్యేక పూజలు, శ్రీరాముని పట్టాభిషేకం, విగ్రహాల ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగుతుంది.

● నేడు శ్రీరామ నవమి వేడుకలు

శక్కర్‌నగర్ రామాలయంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సీతారాముల కళ్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, రాత్రి 7 గంటల నుంచి 12 గంటల వరకు రథోత్సవ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గురువారం ఉదయం 9 గంటలకు శ్రీరాముని పట్టాభిషేకం, అన్నదాన కార్యక్రమం కొనసాగనుంది. శ్రీరామ నవమి వేడుకలకు ఆలయ కమిటీ పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసింది.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆలయాన్ని సర్వంగా సుందరంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. మంగళవారం డొంకేశ్వర్ రామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించి సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు విగ్రహాలకు వేదపండితులు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకీపై ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ కళ్లెం గంగారెడ్డి, నాయకుడు మధు, గొల్ల మహేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మురళీగౌడ్, అంజి, ఎంపీటీసీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని కోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెంజర్ల గ్రామంలోని ఆలయంలో హోమం, హన్మాన్ వాహనసేవ, గరుడ వాహనసేవ, ప్రత్యేక పూజ నిర్వహించారు. బుధవారం శ్రీరామ నవమి, 10.30అభిజిత్ లగ్న ముహూర్తంలో సీతారామ చంద్రస్వామి కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్ర రథోత్సవం నిర్వహించే స్వామివారికి కళ్యాణానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని రంగులతో వివిధ రంగుల పువ్వులతో విద్యుత్ దీపాలతో, చాలువ పందిరి అలంకరించారు. ఉత్సవమూర్తులకు గోదావరి స్నానం చేయించి 9గంటలకు ఆలయంలో మహా అన్నదానం నిర్వహించనున్నారు.

● సిద్దులగుట్టపై శ్రీరామ నవమికి ఏర్పాట్లు

పెర్కిట్: శ్రీరామ నవమి సందర్భంగా ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సీతరాముల కళ్యాణం పురస్కరించుకొని గుట్టపై రామాలయం ఎదుట పచ్చటి మామిడి తోరణాలతో కళ్యాణ పందిరి వేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం వేదపండితులు వేదంతం గోపికృష్ణశర్మ, ఆల య ప్రధానఅర్చకుడు కుమార్‌శర్మ పంతులు కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ సంవత్సరం సీతరాముల కళ్యాణం భద్రచలంలో ఏ విధంగా నిర్వహిస్తారో అదే విధంగా సిద్దులగుట్టపై అంగరంగా వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు అన్నప్రసాద వితరణ సాయంత్రం వరకు కొనసాగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతరాముల కళ్యాణం వీక్షించాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం గుట్ట కింది నుంచి ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, బోండ్ల ఆనంద్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, కొంతం మురళీ, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్:సాయిబాబా జన్మదిన వేడుకలకు నగర శివారులోని మాధవ నగర్ సాయిబాబా ఆలయం ముస్తాబైంది. బుధవారం సాయిబాబా జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9గంటలకు సాయిబాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవీందర్‌గుప్త తెలిపారు.మధ్యాహనం 12 గంటలకు శ్రీరామనవమి కల్యాణోత్సవాన్ని ఆలయప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ముప్కాల్‌లో ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



సిద్దులగుట్టపై కల్యాణ పందిరిని ఏర్పాటు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

● తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం జాతర ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నారు. మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఎమ్మెల్యే దంపతులు, భక్తులు తిలకరించారు. బుధవారం రథోత్సవం జరగనుంది. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: శ్రీసీతారామచంద్రమూర్తి కళ్యాణమహోత్సవానికి రూరల్ మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీసీతారాముల కళ్యాణానికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను రంగురంగు లైట్లతో ముస్తాబుచేశారు. గుండారంలోని శ్రీకోదండరామాలయం, శ్రీనగర్‌లోని రామాలయం, తిర్మన్‌పల్లిలోని సీతారామాలయం, సారంగపూర్‌లోని శ్రీకోదండరామాలయంలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద తాటాకు పందిళ్ల వేశారు. మంచినీరు, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

స్ట్రాంగ్ రూంల కోసం ఎంపీడీవో కార్యాలయం పరిశీలన



డిచ్‌పల్లిలో ఈవీఎంల భద్రపరిచేందుకు గదులను పరిశీలిస్తున్న ఆర్డీవో

డిచ్‌పల్లి,ఏప్రిల్ 16:వచ్చే నెలలో పార్లమెంట్ ఎలక్షన్స్ జరగనున్న నేపథ్యంలో కౌంటింగ్ పూర్తి అనంతరం ఈవీయం లను స్ట్రాంగ్ రూంలను భద్రపరిచేందుకు డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని తహసీల్దార్ ప్రభాకర్ తో కలిసి ఆర్డీవో రాజేందర్ కుమార్ మంగళవారం పరిశీలించారు. గదులను శుభ్రం చేస్తు ఉంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

●తహసీల్దార్ కార్యాలయం సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) కిరణ్మాయి సందర్శించారు. కార్యాలయంలో జరుగుతున్న ధరణి పోర్టల్, సర్టిఫికెట్‌ల విధివిధనాలను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ ప్రభాకర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

నవీపేట,ఏప్రిల్16:మండలంలోని ఫకీరాబాద్, మిట్టాపూర్‌ల మధ్యన సోమవారం రాత్రి రైలు కింద పడి సుమారు 55సంవత్సరాల వయసు గల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని నిజామాబాద్ రైల్వే ఎస్‌ఐ సాయిరెడ్డి తెలిపారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ షర్టు, వంకాయ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నిజామాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

నవీపేట,ఏప్రిల్16: మండల కేంద్రానికి చెందిన ర్యాగళ్ల లావణ్య అలియాస్ లక్ష్మి నర్సమ్మ(42)అనే ఉపాధి కూలీ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. సోమవారం స్థానిక లింగమయ్య గుట్ట చెరువు పూడికతీత పనులలో పాల్గొన్న లావణ్యకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతురాలికి భర్త రాజశేఖర్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

మోపాల్, ఏప్రిల్ 16:మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామానికి చెందిన మహిళ రైతు అరికెల లక్ష్మి రోడ్డుపై వడ్లను ఆరబోస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం ఆమెను మాటలో దింపి మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని బాధితురాలు మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మి వరిధాన్యాన్ని రోడ్డుపై పోసి ఆరబోస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమెను మాటలోదింపి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష

ఖిల్లా, ఏప్రిల్ 16: పేకాట, అసభ్యంగా, మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురు వ్యక్తులకు రెండు రోజుల పాటు కోర్టు జైలు శిక్ష విధించినట్లు మూడో టౌన్ ఎస్సై ఎల్.ప్రవీణ్ తెలిపారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో పేకాట ఆడుతున్న ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకొని మంగళవారం కోర్టు ఎదుట హాజరుపర్చగా వారిద్దరికి న్యాయాధికారి సయ్యద్ ఖదీర్ రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తిని, అసభ్యంగా ప్రవర్తించిన మరో ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా వారికి సైతం రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించారు. ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నామని మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై తెలిపారు.

'వంటగ్యాస్ వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలి'



మహిళలకు గ్యాస్ సిలండర్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఖిల్లా, ఏప్రిల్ 16: గృహోపయోగమైన వంటగ్యాస్ సిలండర్‌ను వినియోగించే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగ్‌రావ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల పలు అపార్ట్‌మెంట్లలో మహిళలకు వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను వారికి అందించి అందులో గల నియమనిబంధనలను పాటించాలని సూచించారు. సిలిండర్ వినియోగంపై ప్రయోగం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.మధు, ప్రశాంత్, ప్రశాంత్‌గౌడ్,బి.సురేష్, వినోద్,ఎస్. సురేష్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బోధన్ అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్‌లలో ప్రజలకు, మహిళలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని మెగాటవర్స్ అపార్టమెంట్‌లో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అగ్నిమాపక వారోత్స వాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అగ్నిప్రమాదాలపై అగ్ని మాపక సిబ్బంది పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అనంతరం అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మధుసూధన్‌రెడ్డి, మెగాటవర్స్ అపార్టమెంట్ అధ్యక్షుడు జెస్సు అనిల్, తదితరులు పాల్గొన్నారు

సిరికొండలో రేణుక ఎల్లమ్మకు బోనాలు

సిరికొండ ఏప్రిల్ 16: రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా సిరికొండలో మంగళవారం గౌడ సంఘ సభ్యులు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లీకి సమర్పించారు.గ్రామానికి చెందిన గౌడ కుల సంఘ మహిళలు ఇంటికో బోనం ఎత్తుకుని మంగళ హారతులతో ఎల్లమ్మదేవీ ఆలయం వరకు దప్పుల చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్లారు. రేణుక ఎల్లమ్మదేవికి నైవేద్యాలను సమర్పించారు. కుటుంబ సభ్యులతో ఎల్లమ్మదేవిని దర్శించుకుని మొక్కులు ముట్టజెప్పుకున్నారు.కార్యక్రమంలో సంఘంగౌడ సంఘం అధ్యక్షుడు హన్మాగౌడ్,కోశాధికారి, రాజేందర్‌గౌడ్,సభ్యులు రాజాగణేష్‌గౌడ్,లక్ష్మినారాయణగౌడ్,రాజేదందర్‌గౌడ్,రామస్వామిగౌడ్, రాజగౌడ్‌పెంటాగౌడ్,రాజబహాద్దుర్‌గౌడ్,నాగభూషన్‌గౌడ్,రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగులో యువకుడి అదృశ్యం

ధర్పల్లి ఏప్రిల్16: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన బండ్ల సందీప్ అదృశ్యమైనట్టు ఎస్సై విక్రం మంగళవారం తెలిపారు. రామడుగు గ్రామానికి చెందిన సందీప్ 11నెలల క్రితం గుంజలి గ్రామానికి ఇల్లారం వెళ్ళినట్టు ఆయన తెలిపారు. రామడుగు గ్రామానికి వచ్చిన సందీప్ ఈనెల 9న ఉదయం అత్తగారిం టికి వెళ్తున్ననని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లినట్టు తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్ళ వెతికిన సమాచారం లభించకపోవడంతో సందీప్ తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దేశంలో సర్వ మతాలు సమానమే



నవీపేటలో ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నవీపేట,ఏప్రిల్16: రాజ్యాంగం ప్రకారం భారత దేశంలో సర్వ మతాలు సమానమేనని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. ఇటీవల రంజాన్ పండుగ విజయవంతంగా ముగినందున మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశంలోని అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు.గురువారం జరిగే శ్రీరామ నవమి పండుగ సందర్భంగా హిందు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ చంద్రమూర్తి పితృ వాక్య పరిపాలకుడిగా ప్రజల హృదయాలలో నిలిచాడని అన్నారు.ఈసందర్భంగా తాహెర్ బిన్ హందాన్‌ను శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్,రాజేందర్ గౌడ్, భగవాన్, చల్లా రవీందర్, మూసా, ఎస్‌కే.బాబు, ముస్తాక్,జబీర్, జియవుద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగులకు తాగునీటి ప్లాంట్ ఏర్పాటు



ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

పెద్దబజార్, ఏప్రిల్ 16: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం రోగులకు తాగునీటి ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో రోగులకు, వారి సహాయకులకు తాగునీటికి ఇబ్బంది ఉండకూడదని ఈ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశామని ఆమె అన్నారు. రోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగేశ్వర్‌రావు, బాల్‌రాజ్, నరేందర్‌కుమార్, కిరణ్, హరీష్, సుజాత, స్వాతి, ఆఫీస్, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

6, 7 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ ఏప్రిల్ 17: సిరికొండలో గల కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాలలో 6,7 తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి షేక్ పర్వీన్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో 40సీట్లు ఖాళీలుండగా, 7వ తరగతిలో 10 సీట్లు ఖాళీలున్నాయని పర్వీన్ తెలిపారు. దరఖాస్తులు చేసుకునే అర్హులైన విద్యార్థినులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్, టీసీ(ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ఆదాయ ధ్రువపత్రాలను. పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి పర్వీన్ కోరారు.

బాల్య వివాహన్ని అడ్డుకున్న అధికారులు

రెంజల్,ఏప్రిల్16: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక వివాహం ఈ నెల 24న జరుగుతుందన్న సమాచారం మేరకు మంగళవారం అధికారులు ఆ గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి బాల్య వివాహన్ని అడ్డుకున్నారు. మైనర్ బాలికకు వివాహం జరిపిస్తే కుటుంబ సభ్యులపై చట్టరీత్యాలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మైనర్‌కు వివాహం జరిపిస్తే వచ్చే ఇబ్బందులను కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ నెల 24న జరగాల్సిన వివాహన్ని రద్దు చేయించారు. అనంతరం బాలికను చైల్డ్ వెల్ఫేర్ సదరంకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి, చైల్డ్ వెల్ఫేర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌమర దశ బాలికలకు అవగాహన

నవీపేట,ఏప్రిల్16: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం కౌమర దశ బాలికలకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కావ్య మాట్లాడుతూ కౌమరదశ బాలికలు ఆరోగ్య విద్యపై పూర్తిగా అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి హెచ్‌ఈవో వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్ కిషన్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్,ఏప్రిల్16: బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లిలో బోయి కులస్థుల ఆరాధ్య దైవం అయిన గంగమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కీర్తనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16: డిచ్‌పల్లి ఏడో పోలీస్ బెటాలియన్ సమీపంలో మంగళవారం రాత్రి రైతులు రోడ్డుపై వరి ధాన్యం ఆరబోయడంతో డిచ్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలు ధాన్యాన్ని గమనించకుండా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న ఆనంద్‌కు బైక్‌ఢీకొనడంతో ఆయన కూడా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులిద్దరిని జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు.

మామిడిపల్లిలో యువకుడి మృతి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్16: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఓ మెకానిక్ గ్యారెజ్‌లో పని చేస్తున్న మారుతి(32) అనే యువకుడు మద్యం మత్తులో కింద పడి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మారుతి గత కొద్ది రోజులుగా గ్యారేజ్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి భోజన చేసిన తర్వాత పడుకున్న వ్యక్తి లేవక పోవడంతో యాజమాని నాగబాబు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

48గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

● రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి



యానంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి,ఏప్రిల్ 16: రైతుల ఖాతాల్లో ధాన్యం కొనుగోలు డబ్బులను ప్రభుత్వం 48గంటల్లో జమచేస్తుందని రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోవొద్దని, రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యానంపల్లిలో పరిశీలించారు. ఇప్పటి వరకు రైతుల ధాన్యం బస్తాలు ఎంత వరకు రైస్ మిల్లర్‌లకు పంపారని, గన్నీ బస్తాలు, లారీల కొరత రాకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని విండో చైర్మన్ రాంచందర్ గౌడ్, సీఈవో కిషన్‌లకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో తాలు పేరుతో రైతుల తీవ్ర నష్టం చేశారని గిట్టుబాటు ధర చెల్లించకుంటే తగిన చర్యలు తీసుకుంటమని అవసరమైతే రైస్ మిల్లుల లైసెన్స్‌లను కూడ రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పరన్నారు. గత ఏడాది సీఎంఆర్ ద్వారా రైసుమిల్లర్‌లు చెల్లించని రూ.900కోట్ల ప్రభుత్వానికి అందజేస మన్నారు. వచ్చే ఆగస్టు 15నాటికి 2లక్షల రుణమాఫీ, రైతాంగానికి బోనాస్ అందజేస్తా మన్నారు. ప్రభుత్వం రైతుల శ్రేయస్సు దృష్యా 2వేల కోట్లతో పంటల బీమాలకు ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వార నిర్మించి రైతు వేదికలు బీఆర్‌ఎస్ హయాంలో ప్యాకేట్ల, మద్యం స్థావరాలుగా ఏర్పాడ్డాయని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారానికి రెండు మార్లు రైతులకు నూతన సాగు విధానాలపై శాస్త్రవేత్తలతో అనుమానాలు నివృత్తి చేస్తున్నమన్నారు. విత్తనాలు తెగుళ్ల పంట మార్కెటింగ్ రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఆన్‌లైన్ వేదిక ద్వారా అవగాహన కల్గిస్తునమన్నారు. బీజేపీ ఎంపీ అర్వింద్ ధాన్యం కొనుగోళ్లపై ధర్నాలు చేయడం అర్థరహితమన్నారు. అనంతరం యానంపల్లిలో అల్కలైన్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ రాంచందర్ గౌడ్, పార్టీ ప్రతినిధులు కంచెట్టి గంగాదర్, పులి వెంకటేశ్వరరావు, డాక్టర్ షాదుల్లా, శక్కరికొండ సాగర్, రాధక్రిష్ణ, అంబర్ సింగ్, రామకృష్ణ, సంతోశ్ రెడ్డి, గంగాధర్, అబీబ్ ఖాన్, గోపు రాజన్న పాల్గొన్నారు.

● అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లోకి వలసలు :రూరల్ ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి అక్రమాల పై విసిగి వేసారిన సుద్దులం గ్రామ యువకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ చేరినట్లు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం సుద్దులం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, సాయి రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో 100మంది చేరగా వారికి ఎమ్మెల్యే కాం గ్రెస్ కండువలు వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఆకాల వర్షాలతో ప్రతి ఏడాది పంటలు నష్టపోయిన సుద్దులం, కోరట్‌పల్లి గ్రామాల రైతులను గత ప్రభుత్వం ఆదుకుంటామని హామీ ఇచ్చి విస్మరించడం వల్లే పార్టీలోకి గ్రామస్థులు చేరుతున్నారని ఎమ్మె ల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కం చెట్టి గంగాధర్,చందురుసాయిరెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీజేపీకి అధికారం ఇవ్వాలి: ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



ఆర్మూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్16: రానున్న ఎన్నికల్లో బీజేపీకి మరోసారి అధికారం ఇచ్చి నరేంద్ర మోదీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ బీజేపీని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అంటే నిజాయితీ అని ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహానాయకుడు నరేంద్రమోదీ అన్నారు. రానున్న ఎన్నికల్లో యువకులు, మహిళలు ప్రతీఒక్కరు బీజేపీకి ఓటు వేసి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు పసుపుబోర్డు మంజూరు చేయించారని, జిల్లా అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేయించి ఎంతో కృషి చేసి అర్వింద్‌ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్, కలిగోట గంగాధర్, జీవీ.నర్సింహరెడ్డి, నూతుల శ్రీనివాస్, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో కుట్టు మిషన్ల పంపిణీ



డొంకేశ్వర్‌లో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ భరత్‌రెడ్డి

డొంకేశ్వర్ ఏప్రిల్ 16: డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా మహిళలకు సొసైటీ చైర్మన్ భరత్‌రెడ్డి కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వాలని ఉద్దేశంతో రుణంపై కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్నామని, ఇంట్లో ఉంటూ కుట్టుమిషన్ ద్వారా మహిళలు ఆదాయం పొందే విధంగా పని చేయాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో కార్యదర్శికృష్ణ, కాంగ్రెస్ నాయకులు నాగరాజు,డైరెక్టర్‌లు పెంటన్న, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కూల్‌వాటర్ అందజేత

రెంజల్,ఏప్రిల్16: మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఎండలో ఉపాధి పనులు చేస్తున్నారని మాతృదేవో భవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాముల సాయిలు ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలకు చల్లని నీటిని అందజేశారు. ఉపాధి కూలీలకు వెళ్లే వారికి నిత్యం తమ ఫౌండేషన్ ద్వారా చల్లని నీటిని అందిస్తామని పాముల సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో ఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రత నుండి కాపాడేందుకు చల్లని నీటిని అందించడం జరుగుతుందని అన్నారు. ఉపాధి హామీ పథకం ఎన్ని రోజులు జరిగితే అన్ని రోజులు తమ సంస్థ ద్వారా చల్లని తాగునీటిని అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షపరులకు శుద్ధజలం పంపిణీ

కమ్మర్‌పల్లి,ఏప్రిల్ 16: హనుమాన్ దీక్షపరులు, కాలినడకన కొండగట్టు అంజన్నదర్శినానర్థం వెళ్తున్న అంజన్నభక్తులు, దీక్షధారులు దాహార్తి తీర్చేనిమిత్తం కమ్మర్‌పల్లిలో హిందుపరిరక్షణసమితి ఆధ్వర్యంలో శుద్ధజలాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో దీక్షలు చేపట్టిన్న హనుమాన్ దీక్షపరులతో పాటు గ్రామం మీదుగా కాలినడకన కొండగట్టు వెళ్లే స్వాములకు ఖర్చులేకుండా 24 గంటల పాటు తాగునీరందించాలన్న ఉద్ధేశంతో జాతీయరహదారి పక్కన ఈ సదుపాయాలు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, అంజన్న భక్తులు పాల్గొన్నారు.

ఎత్తొండలో బీజేపీ ఇంటింటి ప్రచారం



ఎత్తొండలో సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్16: కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో బీజేపీ నాయకులు ఎంబీ పాటిల్ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కోటగిరి ఉమ్మడి మండలంలోని హంగర్ల, హెగ్డోలి, పొతంగల్ గ్రామాలలో ఇంటింటి ప్రచారం కొనసాగింది. కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వచ్చేది నరేంద్ర మోడీ ప్రభుత్వమేనని ఎంబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, విజయ్ పటేల్, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు తప్పిన పెను ప్రమాదం



ముప్కాల్ పాఠశాలలో మంటలను అర్పుతున్న స్థానికులు

ముప్కాల్,ఏప్రిల్16:ముప్కా ల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం ఆకస్మికంగా జరిగిన అగ్నిప్రమాదంలో పాఠశాలకు పెను ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో పాఠశాల వెనుక వైపు గల చిన్న సందులో ప్లాస్టిక్ పైపులు, వ్యర్థాలు పడి ఉండడంతో ఆకస్మికత్తుగా బయటకు వెళ్ళి పక్కనే ఉన్న కంప్యూటర్ ల్యాబ్ గదిలోకి మంటలు చెలరేగాయి. అది గమనించిన స్థానికులు హుటాహుటిన మంటలను అర్పారు. దాంతో పాఠశాలకు పెను ప్రమా దం తప్పింది. కంప్యూటర్ ల్యాబ్ పూర్తిగా కాలిపోయింది. పూర్వ విద్యా ర్థులు, ఉపాధ్యాయులు వచ్చి గమనించడంతో ప్రమాదాన్ని నిర్మూలించ గలిగార న్నారు. చుట్టు పక్కల ఉన్న ఇళ్ల వారు కూడా ప్రమాదం తప్పి నట్టు స్థానికులు తెలిపారు.

ఏపీ మాజీ మంత్రులను కలిసిన జిల్లా టీడీపీ నాయకులు



ఏపీ మాజీ మంత్రిని సన్మానిస్తున్న నిజామాబాద్ టీడీపీ నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16: ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు, టీడీపీ నాయకులు దేవినేని ఉమామహేశ్వర్‌రావు, నక్క ఆనంద్‌బాబులను నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాంయాదాగౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో వారిని కలిసి ఘనంగా సన్మానించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌కు నష్టం వాటిల్లుతుందని బాబ్లీప్రాజెక్టు విషయంలో జరిగిన ఉద్యమంలో జరిగిన కేసుల్లో భాగంగా నాందేడ్ జిల్లా బిలోలిలో కోర్టుకు వెళ్తున్న నాయకులను కలిసి ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం జిల్లాలో పార్టీ సంస్థాగత విషయాలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్, అర్బన్ ఇన్‌చార్జి వినోద్ కుమార్, నాయకులు నాగేశ్వర్‌రావు, అంబిక సత్యనారాయణ, బొబ్బ నర్సింహారావు, శంకర్ ముదిరాజ్, లవంగరాజు, రాములు, సద్గుణరావు, రాజేశ్వర్, రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

24న జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని నాగారం స్టేడియంలో ఉదయం 8గంటల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14, 16, 18,20 బాల బాలికల విభాగంలో, స్త్రీ పురుషుల విభాగంలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. 23వ తేదీన సాయంత్రం 5గంటలలోపు 9989040776 నెంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

20 నుంచి మే 20 వరకు వేసవి శిక్షణ శిబిరం

పెద్దబజార్, ఏప్రిల్ 16: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, నిజామాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి మే 20 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రసేన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో, ఇందిరాగాంధీ మినీస్టేడియం కామారెడ్డి, మోడల్ స్కూల్ మామిడిపల్లిలో క్రికెట్ క్రీడను బాల బాలికలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9849073809, 9666677786 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సీఎంసీలో ఉచిత హెల్త్ క్యాంపు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16: మెదక్ సీఎస్ఐ డయాసిస్ ఆధ్వర్యంలో ఈ నెల 17,18న మెగా హెల్త్ ఉచిత క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ డిచ్‌పల్లి ప్రతినిధి శాంసన్ తెలిపారు. రెండు రోజుల పాటు పలు వ్యాధుల చికిత్సలో గుర్తింపు పొందిన ప్రముఖ వైద్యులు హాజరవుతున్నారని, కావున గ్రామీణ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పతనం తప్పదు'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి అని రేవంత్‌రెడ్డి బేషరత్తుగా మాదిగ సమాజానికి క్షమాపణ చెప్పాలని జిల్లా ఎంఎస్‌పి అధ్యక్షుడు సరికెల పోశెట్టి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పతనం తప్పదని హెచ్చరించారు. ఎంపీ మూడు ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వకుండా మొత్తం మాలలకు ఇవ్వడం మాదిగలను అవమానించడమే అవుతుందన్నారు. చట్టసభల్లో అవకాశాలు కల్పించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఎన్ని ఇచ్చిన ఫలితం ఉండదని అన్నారు. మాదిగ నాయకత్వం మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే రాజకీయ సమాధి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, ఎంఆర్‌పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి మైలారం బాలు, ప్రధాన కార్యదర్శి భూమన్న, రొడ్డ ప్రవీణ్, యమున, సుధా, ఫకీరానాయక్, శ్యామ్, విప్లవ్, సునీల్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సులకు చెందిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 2,4,6వ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షల ఫీజు ఈ నెల 25 తేది వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవచ్చు అని సీవోఈ ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుమతో ఏప్రిల్ 26 వరకు, రూ.500 లతో ఏప్రిల్ 27వరకు, రూ.1000 లతో ఈ నెల 29 వరకు, రూ.2000 లతో 30వ తేది వరకు ఫీజు చెల్లించుకోవచ్చు అని పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని ఆమె సూచించారు.

పాస్‌పోర్టు పోయినది

పడాల నవీన్ తండ్రి పడాల సత్యనారాయణ గౌడ్ R/O ఇ.నెం.3-78-1, గ్రా. ఫతేపూర్, మం. ఆర్మూర్, జి. నిజామాబాద్ TS యొక్క పాస్‌పోర్ట్ నెం. T6928133 గలది బైక్‌పై ఫతేపూర్ నుండి ఆర్మూర్ వెళ్తుండగా పోయినది. దొరికినవారు సం. 9951531919

సిర్నాపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



సిర్నాపల్లిలో రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

ఇందల్వాయి, ఏప్రిల్ 16:ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డీఆర్‌డీవో సాయాగౌడ్ సందర్శించి రైతులను ధాన్యం కొనుగోలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రంలో 10వేల క్వింటాల ధాన్యం కొనుగోలు చేశారని అందులో 2614 క్వింటాల ధాన్యం కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం బస్తాలను తరలించేందుకు లారీలను తొందరగా పంపించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీపీఎం సాయిలు, ఏపీఎం సువర్ణ, గ్రామ శాఖ అధ్యక్షురాలు సుజాత, సెక్రెటరీ సవిత, వీవోఏలు స్వప్న, సువర్ణ, రైతులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు తెచ్చిన అర్వింద్‌పై తప్పుడు ప్రచారం సిగ్గుచేటు

● బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్16: ఇచ్చిన మాట ప్రకారం పసుపుబోర్డు తెచ్చిన ఎంపీ అర్వింద్‌పై కొందరు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ జిల్లా సాక్షిగా పసుపు బోర్డును ప్రకటించగా రాష్ట్రపతి గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పసుపు దిగుమ తిని తగ్గించి ఎగుమతి పెంచడంతో పసుపు రైతులకు మంచి ధర పలుకుతుం దని, కొందరు రైతుల ముసుగులో అస త్య ప్రచారాలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఎండ గట్టాల్సింది పోయి వారితో కుమ్మ క్కై ఎంపీ గురించి మాట్లాడడం సిగ్గు చేటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజే పీ కిసాన్‌మోర్చ నాయకులు చిట్టిబాజన్న, తేలు ఒడ్డెన్న, దుమ్ముల బాజన్న, చిట్టి నరేష్,లింగన్న, తదితరులు పాల్గొన్నారు.